

అభివృద్ధికి సహకారం

రైతులకు ఉపయోగపడేలా మార్కెట్‌ల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. 8లో▸



రూ.3.16కోట్లు

ఆర్టీసీ సంస్థకు దసరా పండుగ కలిసొచ్చింది. సెలవులు కాసులు కురిపించాయి. భారీగా ఆదాయం సమకూరింది. 8లో▸



ప్రజాపాలన పేరిట దోపిడీ

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. 8లో▸

న్యూస్‌రీల్

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని తట్టిఖానా సర్వేనంబర్ 26.. పసుమాముల సర్వేనంబర్ 422లోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన నిర్మాణాలపై అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులు కొరడా ఝళిపించారు. మండల తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఆర్‌ఐ నిజాముద్దీన్ సిబ్బందితో కలిసి వెళ్లారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను జేసీబీల సాయంతో కూల్చివేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

తలకొండపల్లి: పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ను ప్రకటించి, వెంటనే అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ అన్నారు. జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూలై నెల వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సంఘం మండల అధ్యక్షుడు మణిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాశీరావు, పూజారి రమేశ్ చుక్కాపూర్, వెల్జాల్, పడకల్ గ్రామాల్లో పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలుసుకొని సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు ఏక కాలంలో చెల్లించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, కేజీబీవీ టీచర్లు, సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ వనం సమరంజిత, హెచ్ఎం రామదాసు, మండల బాధ్యుడు మణిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉదారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మ్యాథ్స్‌బీకి విశేష స్పందన



పరీక్షకు హాజరైన విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శనివారం రెండో రోజు సాక్షి మ్యాథ్స్ బీ 1, 2, 3 ,4 కేటగిరీలకు సంబంధించి పాఠశాల స్థాయి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 80 మంది బాలురు, 73 మంది బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సువర్ణగోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సాక్షి మీడియా చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు విద్యార్థుల నైపుణ్యం మెరుగు పర్చుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జైసన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకాలు చదివే సంస్కృతి పెరగాలి: మంత్రి జూపల్లి

సాక్షి, సిటీబ్యూరో: పుస్తకాలు చదివే సంస్కృతి మరింత పెరగాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం తన క్యాంప్‌ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 37వ హైదరాబాద్ బుక్‌ఫె యిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సమాజంలో పుస్తక పఠన సంస్కృతిని పెంపొందిస్తోందని అభినందించారు. ఈ ఏడాది డిసెంబర్ 19 నుంచి 29 వరకు 10 రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే పుస్తక ప్రదర్శనకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, జనరల్ సెక్రటరీ వాసు మాట్లాడుతూ.. సందర్శకులకు, రచయితలకు, స్టాళ్ల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

కలల కొలువు

పట్టుబట్టారు.. అనుకున్నది సాధించారు

సండే స్పెషల్



చదువంటే ఎంతో ఇష్టం



షాద్‌నగర్: పట్టణంలోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటున్నాం. తండ్రి రాములు కూరగాయల మార్కెట్‌లో, తల్లి పుష్పలత కోర్టులో అటెండర్‌గా పని చేస్తున్నారు. మేము ముగ్గురం అక్కాచెల్లెళ్లం. ఓ తమ్ముడు ఉన్నాడు. చదువు అంటే నాకు ఎంతో ఇష్టం. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీ కోచింగ్ తీసుకున్నాను. ఉద్యోగంలో చేరి విద్యార్థులకు పాఠాలు బోధించడం చాలా ఆనందంగా ఉంది.

– వైష్ణవి, ఇప్పలపల్లి

పట్టు వదలకుండా..



ఆమనగల్లు: తండ్రి కృష్ణయ్య 2014లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తల్లి యాదమ్మ నేను ఉపాధ్యాయుడు కావాలని ఆశించింది. దీనికి తగినట్టు చదవడం ప్రారంభించాను. 2017 డీఎస్సీలో 1.5 మార్కుల తేడాతో అవకాశం చేజారింది. అప్పటి నుంచి ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ కోసం ప్రిపేర్ అయ్యాను. జిల్లాలో 78వ ర్యాంకు వచ్చింది. ఆమనగల్లులోని శెట్టిపల్లి యూపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా చేరాను. పట్టుదలతో శ్రమించి తల్లి కలలను సాకరం చేయడంతోపాటు నా కాళ్లపై నేను నిలబడడం సంతోషంగా ఉంది.

– శ్రీకాంత్, శెట్టిపల్లి



శెట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న శ్రీకాంత్

మరిచిపోలేని అనుభూతి



ఇబ్రహీంపట్నం: అమ్మ శశికళ ప్రైవేట్ టీచర్‌గా, నాన్న జంగయ్యగౌడ్ చిన్న ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చెల్లెలితోపాటు నన్ను చదివించారు. ఇద్దరం ఆడ సంతానమైనా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యాబుద్ధులు నేర్పించారు. వారి కష్టానికి ప్రతిఫలంగా మూడు నెలల క్రితం మా సోదరి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో టీజీటీ ఉద్యోగాన్ని సాధించింది. ఇప్పుడు నేను ఎస్‌జీటీ ఉద్యోగాన్ని దక్కించుకోవడంతో మా కన్నవారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇబ్రహీంపట్నం మండలం బొంగ్లూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (ఎంపీపీఎస్) ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాను. తొలి రోజు విద్యాబోధన చేస్తుంటే చెప్పలేని ఆనందం, అనుభూతి కలిగాయి. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు నావంతు ప్రయత్నం చేస్తాను.

– ఓరుగంటి శృతి

అంధత్వాన్ని జయించి..



రాఘవేందర్

తలకొండపల్లి: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని.. పట్టుదల, సాధించాలన్న సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదని నిరూపించాడు మండల పరిధిలోని పడకల్ గ్రామానికి రాఘవేందర్. చిన్నప్పుడే కంటి చూపు కోల్పోయాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వారికి చేదోడువాదోడుగా ఉండాలనుకున్నాడు. ప్రత్యేక శిక్షణ ద్వారా బ్రెయిలీ లిపి నేర్చుకున్నాడు. ఎలాంటి శిక్షణ లేకుండా యూట్యూబ్‌లో పాఠాలు విని డీఎస్సీకి ప్రిపేరయ్యాడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ టీచర్‌గా ఎంపికయ్యాడు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.

కుటుంబ సభ్యుల అండదండలతో..



మారుతి

ఆమనగల్లు: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందంటున్నాడు తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన తుపాకుల మారుతి. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చినప్పటికీ సాధించాలన్న పట్టుదల ఉంటే కాదేది అసాధ్యం అంటున్నాడు. 2017 డీఎస్సీలో స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరుత్సాహ పడలేదు. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. రెండేళ్ల క్రితం తండ్రి కృష్ణయ్య మృతిచెందడం.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తల్లి భాగ్యమ్మ, సోదరుడి ప్రోత్సాహంతో లక్ష్యాన్ని మరువలేదు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న కలను సాకారం చేసుకున్నాడు.

పోలీస్ శిక్షణ నుంచి ఉపాధ్యాయుడిగా..



పాఠశాలలో రిపోర్టింగ్ చేస్తున్న చేగూరి శ్రీకాంత్

కడ్తాల్: సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన కేశంపేట మండలం సంతాపూర్‌కు చెందిన చేగూరి శ్రీకాంత్ విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల ల్లోనే కొనసాగింది. క్రమశిక్షణ పట్టుదలతో చదివి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్న తపనతో పోలీస్ శిక్షణలో ఉంటూనే రేయింబవళ్లు కష్టపడి చదివి ఇష్టమైన ఉద్యోగం సాధించాడు. కడ్తాల్ మండలం రావిచేడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా బాధ్యతలు చేపట్టాడు. పేదరికం ఉన్నా లక్ష్యం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని చెబుతున్నాడు.

కష్టపడి చదివించారు



షాద్‌నగర్: మాది వ్యవసాయ కుటుంబం. ఐదుగురిలో నేను రెండో సంతానం. చిన్నప్పటి నుంచి అమ్మానాన్నలు కష్టపడి చదివించారు. ఏపీలోని అవనిగడ్డలో బీఈడీ కోచింగ్ తీసుకున్నాను. జిల్లా స్థాయిలో 21వ ర్యాంక్ సాధించి అనుకున్న లక్ష్యాన్ని అందుకున్నాను.

– మాధవి, పాపిరెడ్డిగూడ, కేశంపేట

అమ్మానాన్నల ప్రోత్సాహంతో..



షాద్‌నగర్: అమ్మానాన్నలు ఉపాధ్యాయులు కావడంతో వారి ప్రోత్సాహంతోనే ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి పెరిగింది. ఉద్యోగం సాధించేందుకు కష్టపడి చదివివాను. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని రామయ్య కోచింగ్ సెంటర్‌లో ఏడాది పాటు కోచింగ్ తీసుకున్నాను. జాబ్ సాధించడం సంతోషంగా ఉంది.

– నివిత, కొత్తూరు ఎస్సీ కాలనీ పాఠశాల

గురుకుల పాఠశాలలో చదివి



షాద్‌నగర్: హైదరాబాద్ బోరబండలోని గురుకుల పాఠశాలలో చదివాను. 2017లో డీఎడ్ పూర్తి చేశాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో బీటెక్ పూర్తి చేశాను. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలన్న లక్ష్యంతో వనపర్తిలోని జయశంకర్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నాను. పట్టుదలతో పగలు, రాత్రి చదివి లక్ష్యం చేరుకున్నాను.

– సంగీత, కొత్తూరు

ఏడాదిలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు



కావలి శ్రీలత

మొయినాబాద్: కృషి, పట్టుదల, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించింది ఓ యువతి. వ్యవసాయ కుటుంబంలో పుట్టిపెరిగిన ఆమె ఏడాది వ్యవధిలోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన కావలి వెంకటేశ్, భాగ్యమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కొడుకు కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తుండగా చిన్న కొడుకు వ్యవసాయం చేస్తున్నాడు. కూతురు శ్రీలత సైతం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగింది. 2020 నుంచి కోచింగ్ తీసుకుంటూ 2022లో టెట్ పరీక్ష రాసింది. అంతలోనే ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సైతం పరీక్షలు రాసింది. 2023 అక్టోబర్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతూనే తిరిగి టెట్ పరీక్ష రాసింది. 2024 డీఎస్సీలో టీచర్‌గా ఉద్యోగం సాధించి మొయినాబాద్ మండలంలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. కష్టానికి ఫలితం దక్కిందని.. అనుకున్నది సాధించినందుకు చాలా ఆనందంగా ఉందని చెబుతోంది.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న శ్రీలత

సంసారం చక్కబెడుతూనే..



అరుణ

చేవెళ్ల: చౌదరిగూడ మండలం జాకారం గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్, భారతమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు ఆడపిల్లలు అని చూడకుండా వారి స్థోమత మేరకు చదివించి ఓ ఇంటివారిని చేశారు. చిన్న కూతురు అరుణ వివాహం అనంతరం భర్త సహకారంతో చదువును కొనసాగించింది. ఇద్దరు పిల్లలను చూసుకుంటూనే ఓపెన్ ఇంటర్, ఓపెన్ డిగ్రీ, పీజీలను పూర్తి చేసింది. 2013లో బీఎడ్ రెగ్యూలర్‌గా చేసింది. ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఇంటివద్ద గ్రూప్స్‌నకు ప్రిపేర్ అయ్యింది. ఇటీవల ప్రభుత్వం డీఎస్సీ వేయడం.. బీఎడ్ చేసి ఉండడంతో దరఖాస్తు చేసి పరీక్ష రాసింది. గతంలో ఒక డీఎస్సీ రాసిన ఉద్యోగం రాలేదు. రెండో ప్రయత్నంలో పడిన కష్టానికి ఫలితంగా జిల్లాలోనే రెండో ర్యాంకు సాధించింది. కుటుంబసభ్యుల ప్రోత్సాహం.. ప్రైవేటు పాఠశాలలో బోధనానుభవం తోడై విజయం సాధించినట్టు చెబుతోంది.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అరుణ

తొలి ప్రయత్నంలోనే ..



భరత్‌కుమార్

చేవెళ్ల: కొందుర్గు మండలం టేకుపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య, నర్సమ్మకు నలుగురు సంతానం. వ్యవసాయమే వారికి జీవనాధారం. నర్సమ్మ మృతితో పెద్ద కుమారుడితో కలిసి కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు చంద్రయ్య. మూడో కుమారుడైన భరత్ కుమార్ వారి ప్రోత్సాహంతో విద్యాభ్యాసం సాగించాడు. డీఎడ్ పూర్తి చేశాడు. డీఎస్సీ- 2024 నోటిఫికేషన్ రావడంతో అవకాశం లభించింది. మొదటి ప్రయత్నంలోనే ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించాడు. చేవెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది. 'ఉద్యోగంలో చేరడం.. తరగతి గదిలో అడుగు పెట్టి బోధించడం అంతా కలలా ఉంది.. ఈ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తాను' అంటున్నాడు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న భరత్‌కుమార్

'విద్యా' కుసుమం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్య

కొందుర్గు: అక్కబాటలోనే తానూ వెళ్లింది. మొదటి ప్రయత్నంలోనే లక్ష్యం సాధించింది షాద్‌నగర్ పట్టణానికి చెందిన విద్య. సాయిలీల, దామోదర్ రెడ్డి దంపతులకు స్వప్న, విద్య ఇద్దరు కూతుళ్లు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే అయినా కాయాకష్టం చేసి కూతుళ్లను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కూతురు స్వప్న 2012 డీఎస్సీలో ప్రతిభచాటి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సంపాదించింది. అక్క అడుగుజాడల్లోనే వెళ్లాలనే లక్ష్యంతో విద్య చదువు పూర్తిచేసింది. డైట్ చేస్తున్న సమయంలో అనారోగ్యంతో తండ్రి మరణించాడు. ఓ వైపు ఆర్థిక పరిస్థితులు.. మరోవైపు తండ్రి దూరమైన బాధను దిగమింగుతూ విద్య కష్టపడి చదివింది. మొదటి డీఎస్సీలోనే ఉద్యోగం సంపాదించింది. ప్రస్తుతం కొందుర్గు మండలం చిన్నఎల్కిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విధుల్లో చేరింది.

పండ్ల వ్యాపారి కూతురు

శంకర్‌పల్లి: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఓ పండ్ల వ్యాపారి కూతురు ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే టీచర్‌గా ఎంపికైంది. రెండేళ్ల కష్టానికి ఫలితం దక్కిందని సంబురపడుతోంది. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అజీజ్, షాబానా దంపతులు నివసిస్తున్నారు. వీరికి కూతురు అయేషా, కుమారుడు ఉన్నారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించినప్పటికీ అయేషాను కష్టపడి చదివించారు తల్లిదండ్రులు. నేరేడ్‌మెట్ ప్రభుత్వ కాలేజీలో డైట్‌లో సీటు సంపాదించింది. అది పూర్తయినా తర్వాత రెండేళ్లలో అయేషా ఐదుసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన టెట్ పరీక్షలు రాసి.. అన్నింటిలోనూ అర్హత సాధించింది. గత డీఎస్సీలో 72.97 పర్సంటేజీతో 45 ర్యాంకు సాధించి 24 ఏళ్ల వయస్సులోనే ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. తనకి సింగాపురం టవర్‌లో పోస్టింగ్ వచ్చిందని తెలిపింది. అమ్మానాన్నలు కష్టపడి చదవించారని, ఇన్నాళ్లకు పడిన కష్టానికి తగిన ఫలితం దక్కిందని సంతోషాన్ని వెలిబుచ్చింది.



తల్లిదండ్రులతో అయేషా

ఒకేసారి దంపతులకు ఉద్యోగాలు



ప్రొసీడింగ్స్ చూపుతున్న కృష్ణ, సంగీత దంపతులు

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగారు. పేదరికం చదువుకు అడ్డుకాదని నిరూపించారు. ప్రేమ వివాహం చేసుకున్నారు. కష్టపడి చదివి ఏకంగా ఒకేసారి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామానికి చెందిన జంగిలి కృష్ణ, సంగీత దంపతులు. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత కూడా చదువుకోవాలనే ఆకాంక్షతో ప్రత్యేక బీఈడీ చేశారు. 2016లో ప్రభుత్వం నిర్వహించిన టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్)లో ఉత్తీర్ణత సాధించారు. కృష్ణ ఎల్ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిలో కొనసాగుతూనే ప్రభుత్వం డీఎస్సీ వేయడంతో ప్రిపేర్ అయ్యాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఇద్దరూ డీఎస్సీకి ఎంపికయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకున్నారు. 'ప్రతి ఒక్కరూ చదువుకోవాలి.. చదువుతోనే జీవితాల్లో వెలుగు' అంటున్నారు.

నెరవేరిన పదేళ్ల కల

మొయినాబాద్‌రూరల్: ఉపాధ్యాయ ఉద్యోగం కోసం పదేళ్లు వేచి చూసిన మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్ గ్రామానికి చెందిన కట్నా హైమావతి ఎట్టకేలకు అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. 2014లో బీఎడ్ పూర్తి చేసింది. వివాహం జరిగి ఆరేళ్లు గడిచింది. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తపనతో ప్రిపేర్ అయ్యింది. భర్త ప్రోత్సాహంతో ముందడుగు వేసింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలతో అనుకున్న గమ్యానికి చేరుకుంది. ముర్తుజాగూడ పాఠశాలలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తోంది.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కట్నా హైమావతి

16 రోజులు.. రూ.3.16 కోట్లు

- షాద్‌నగర్ ఆర్టీసీకి కాసులు కురిపించిన దసరా
- 6.68లక్షల మంది ప్రయాణం
- 110.81 ఆక్యుపెన్సీ రేషియో

షాద్‌నగర్: ఆర్టీసీ సంస్థకు దసరా పండగ కలిసొచ్చింది. పండుగ సెలవులు కాసులు కురిపించాయి. ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 14వరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరింది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు ఇంటిబాట.. మళ్లీ ఇంటి నుంచి తిరుగుప్రయాణం కట్టారు. ఫలితంగా బస్సులన్నీ కిటకిటలాడాయి.

4.83వేల కిలోమీటర్ల ప్రయాణం

సెలవుల్లో షాద్‌నగర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో 4.83వేల కిలోమీటర్ల మేర బస్సులను నడిపారు. 110.81శాతం ఆక్యుపెన్సీ రేషియోతో 6.68లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చారు. దీంతో ఈనెల 2 నుంచి నుండి 17 వరకు సంస్థకు రూ.3,16,60,518 ఆదాయం సమకూరింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ రూట్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆ రూట్లలో స్పెషల్ బస్సులు నడిపి ఆదాయం గడించారు.



అదనపు బస్సులు నడిపించాం



దసర పండగ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సు సర్వీసులు నడిపించాం. 16రోజుల్లో రూ.3.16కోట్ల ఆదాయం సమకూరింది. మహబూబ్‌నగర్, హైదరాబాద్ రూట్లలో భారీగా ఆదాయం వచ్చింది

– ఉష, డీఎం, షాద్‌నగర్ డిపో

రోజువారీగా ఆదాయ వివరాలు

తేదీ	ఆదాయం లక్షల్లో
2న	రూ.22,11,279
3న	రూ.16,33,046
4న	రూ.20,17,636
5న	రూ.19,72,759
6న	రూ.21,77,142
7న	రూ. 19,86,177
8న	రూ.21,50,412
9న	రూ.19,86,177
10న	రూ.18,39,161
11న	రూ.18,93,775
12న	రూ.18,00,722
13న	రూ.12,02,477
14న	రూ.11,05,085
15న	రూ.28,41,262
16న	రూ.26,38,652
17న	రూ.22,72,793

మార్కెట్‌ల అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

- రాజేంద్రనగర్‌కు కలెక్టర్ కార్యాలయం తీసుకువచ్చే యత్నం
- చేవెళ్ల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని.. గత సర్కార్ చేసిన రూ.7లక్షల కోట్ల అప్పులను సరిచేసుకుంటూ ప్రభుత్వాన్ని గాడిలో పెడుతున్నారని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్ పాలకవర్గ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బి.రాములుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా మార్కెట్‌ల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. మార్కెట్‌లో ఏర్పాటు చేసే మౌలిక వసతులు, అభివృద్ధి ప్రతిపాదనలు పంపించాలన్నారు. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు వీలైనంత త్వరగా ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ కార్యాలయం రాజేంద్రనగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. చేవెళ్ల-ప్రాణహిత నీళ్లు ఇక చేవెళ్లకు రావని.. ఈ పాపం కేసీఆర్ కుటుంబానిదే అన్నారు. త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంతానికి నీరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొత్తపాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గంలో డైరెక్టర్లుగా పి.లలిత, యాదిరెడ్డి, బాలయ్య, నరేందర్, హనీఫ్, మల్లేశ్, సత్యనారాయణ, సుదర్శన్, యాదయ్య, టి.జనార్దన్, కె.వెంకట్‌రెడ్డి, ఎ.కృష్ణారెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, వసంతం, షాబాద్ దర్శన్, సమత, మాలతి, శైలజ, వీరేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, బాల్‌రాజ్, పెంటారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చెన్నయ్య, చంద్రశేఖర్, మహేందర్ ముదిరాజ్, చంద్రారెడ్డి, రాంరెడ్డి, మార్కెట్ శాఖ అధికారులు అశ్వక్, సుజాత, జి.మహేందర్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి: ఎమ్మెల్యే

మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చొరవ తీసుకుని జిల్లా గ్రంథాలయ కేంద్రం చేవెళ్లలో ఏర్పాటు చేసేందుకు మరో రెండు కోట్ల నిధులు తీసుకువచ్చేందుకు చొరవ తీసుకోవాలన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

ఆలయాల రక్షణకు సిట్ ఏర్పాటు చేయాలి

అనంతగిరి: తెలంగాణలోని హిందూ దేవాలయాలపై జరుగుతున్న వరుస దాడులపై సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం)ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతిసేలా ఎవరు ప్రవర్తించిన కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి దేవాలయం వద్ద పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాల రక్షణ బాధ్యతలను ప్రజలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీకాంత్, ప్రభాకర్ గౌడ్, విద్యాసాగర్, శశిధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ జిల్లా నాయకులు

ప్రజాపాలన పేరిట దోపిడీ

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులకు తొమ్మిది శాతం కమీషన్ తీసుకుని బిల్లులు విడుదల చేస్తున్నారన్నారు. ఎన్నిల హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రజాధనం లూటీ చేసేందుకే మూసీ సుందరీకరణ తెరపైకి తీసుకువచ్చారన్నారు. గతంలో రూ.50వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేపట్టవచ్చన్న రేవంత్‌రెడ్డి రూ.లక్షాయాభై వేల కోట్లకు ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలన్నారు. హైడ్రా పేరిట పేదలను నిరాశ్రయులను చేస్తున్నారని మండిపడ్డారు. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎవరి ప్రయోజనం కోసం మార్పులు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ట్రిపుల్‌ఆర్ పక్కనే ఉన్న అజిలాపురం సమీపంలోని కుందారం భూములను కొందరు బలవంతంగా తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

రాజకీయ భిక్షపెట్టిన కేసీఆర్‌పై విమర్శలా..?

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రాజకీయ భిక్ష పెట్టి రెండుసార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన కేసీఆర్‌పై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని జైపాల్‌యాదవ్ ప్రశ్నించారు. విద్యావ్యాపారం చేసే కసిరెడ్డికి వ్యాపారధోరణి తప్పితే ప్రజాసేవ ఎక్కడా లేదన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి రాజకీయ అజ్ఞాని, అవివేకి అని విమర్శించారు. తాను ప్రజాసేవే లక్ష్యంగా పనిచేశానని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, పార్టీ నాయకులు నిరంజన్‌గౌడ్, సాయిలు, రఘు, శ్రీనునాయక్, బాలస్వామి, పంతునాయక్, శంకర్, రమేశ్, సుభాశ్, శివ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అర్జున్



పూడూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్-19 విభాగంలో ఎన్కేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి అర్జున్ ఎంపికైనట్లు పీఈటీ వెంకట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అర్జున్ ఫరూక్‌నగర్‌లో నిర్వంచిన పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరుపున సత్తా చాటాడన్నారు. నారాయణపేట్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్జున్ ఆడనున్నాడు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ సరళ అర్జున్‌ను అభినందించారు.

అమ్మవారి ఆలయంలో చోరీకి విఫల యత్నం

నిందితుడికి రిమాండ్

మీర్‌పేట: అమ్మవారి ఆలయంలో చోరీకి యత్నించిన యువకుడిని మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం. లెనిన్‌నగర్‌కు చెందిన సీతారాం కుమారుడు జె.కుమార్ (20) బోర్‌వెల్ కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధ రాత్రి 1.30 గంటలకు శ్రీకాంత్ బడంగ్‌పేటలోని పోచమ్మ ఆలయంలో దొంగతనం చేసేందుకు ప్రవేశించాడు. గమనించిన స్థానికులు 100కు డయల్ చేయడంతో మీర్‌పేట పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎంత ప్రయత్నించినా హుండీ తెరుచుకోలేదని.. నిందితుడిపై గతంలోనూ చోరీ కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వాగులోపడి వ్యక్తి మృతి



జంగయ్య (ఫైల్)

కేశంపేట: ప్రమాదవశాత్తు వాగులోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కొండకళ్ల జంగయ్య(45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్తున్నాని భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో వెతుకుతుండగా శ్మశానవాటిక సమీపంలో కనిపించినట్లు గ్రామానికి చెందిన కృష్ణయ్య వారికి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి శ్మశానవాటిక సమీపంలో కత్వ వాగు వద్ద పరిశీలించగా మృతుడి చెప్పులు, బట్టలు వాగుపై కనిపించాయి. చీకటి పడడంతో వాగులో వెతికినా ఎటువంటి ఆనవాళ్లు లభించలేదు. శనివారం ఉదయం గాలింపు చేపట్టగా వాగులోని ఓ గుంతలో శవం లభ్యమైంది. బహిర్భూమికి లేదా స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉంటాడని ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.